ముందస్తు చర్యలతో..
ప్రమాదాల నివారణ

- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జీ రవినాయక్, అగ్నిమాపక శాఖ అధికారులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 13 : వేసవిలో తరుచుగా అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. ఉష్ణోగ్రత పెరగడం, ఎండుగడ్డి, చెత్తాచెదారం ఎండి ఉండటం, విద్యుత్ వినియోగం అధికమవడంతో నిప్పురవ్వలు రాలి మంటలు వ్యాపిస్తుంటాయి. ఇందు కోసం వేసవిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏప్రిల్ 14 నుంచి 20 వరకు ప్రతిఏటా అగ్నిమాపక వారోత్స వాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఏడాది కాలంగా 120కి పైగా అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రూ.2.50 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగింది. అగ్నిమాపకశాఖ రూ.4 కోట్లకు పైగా ఆస్తి నష్టాన్ని నివారించింది. జిల్లాలో దాదాపు 100 ఫైర్‌కాల్స్ వచ్చాయి. వారోత్స వాలలో భాగంగా ప్రతిరోజు ఒక కార్యక్రమాన్ని చేపట్టా లని అగ్నిమాపక శాఖ నిర్ణయించింది. మొదటిరోజు పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించనున్నారు. ఆ తరువాత పాఠశాలలు, కళాశాలల వద్ద అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. అపార్ట్ మెంట్‌లు, పట్టణ కూడళ్లలో మంటల వ్యాప్తి నియం త్రణపై ప్రదర్శన చేస్తారు. వారం రోజులు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విద్యుదాఘాతంతో అధికనష్టం

వేసవిలో ఎక్కువగా విద్యుత్ ద్వారా ప్రమాదాలు జరుగుతుంటాయి. రాత్రివేళ దుకాణం బంద్ చేసి వెళ్లిన తరువాత విద్యుదాఘాతంతో పెద్దఎత్తున నష్టం జరుగుతుంది. ఇప్పటికే ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇంట్లో, దుకాణాలు, గోదాములలో నాసిరకంగా ఉన్న విద్యుత్ పరికరాలు, వైరింగ్‌ను వినియోగించ కూడదు. అతు కులు కలిగిన విద్యుత్ తీగలు, లూజు వైరింగ్‌ను ఉప యోగించకూడదు, విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు ఉన్నప్పుడు రక్షణకోసం నాణ్యత కలిగిన ఫ్యూజులు, మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్స్‌ను వినియోగించాలి. అధిక ఓల్టేజీ ఉపకరణా లకు ఎర్తింగ్ ఉన్న త్రీపిన్ సాకెట్స్ తప్పని సరిగా వాడాలి. లాప్‌ట్యాప్స్ సెల్ ఫోన్ చార్జింగ్ బెడ్‌కు దగ్గరగా పెట్టొద్దు. విద్యుదాఘా తానికి గురైన వ్యక్తికి అధిక మోతాదులో నీరు తాగించాలి.

వంట గదిలో..

వంటగదిలో వంట పూర్తైన తరువాత రెగ్యులేటర్‌ను విధిగా ఆఫ్ చేయాలి. గ్యాస్‌లీక్ అయితే భయపడకుండా పడ కుండా వెంటనే రెగ్యులేటర్‌ను బంద్ చేయాలి. ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయవద్దు. దేవుని దీపాలు, అగర్‌బత్తీలు ఆర్పివేయాలి. గాలి వెలుతురు కోసం అన్ని కిటికీలు, తలుపులు తెరిచి ఉంచాలి. సిలిండర్ గ్యాస్‌లీకై మంటలు వ్యాపిస్తే గోనెసంచి, తడి దస్తులు మండుతున్న సిలిండర్‌పై వేయాలి. బేకింగ్ సోడాతో కూడా మంటలను అదుపు చేయవచ్చు. కాలిన శరీరభాగం మీద చల్లటి నీరు పోయాలి. పొగతో నిండిన గదుల నుంచి బయటకు రావాలంటే మోచేతులు, మోకాళ్లపై పాకుతూ రావాలి. నోటికి అడ్డంగా తడి గుడ్డ ఉంచాలి. దీని వల్ల గాలి పీల్చినపుడు పొగ, కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చకుండా నివారించవచ్చు. ఆస్పత్రులు, సినిమాటాకీసుల్లో, పాఠశాలలు, షాపింగ్‌మాల్స్‌లో విధిగా ఫైర్ ఎక్స్‌ట్రిమిషన్‌లను వినియోగించాలి.

తగ్గిన ఎండలతో ఉపశమనం

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్‌టౌన్/వనపర్తిఅర్బన్/గద్వాల ఏప్రిల్ 13 : నాలుగు రోజులుగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉష్ణోగ్రత కాస్త తక్కువగా నమోదవుతుండటంతో వడగాలులు, ఎండవేడిమి, ఉక్కపోతతో కాస్త ఉపశమనం లభిస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్‌లో శనివారం 40.1 డిగ్రీలు నమోదు కాగా కేటీదొడ్డిలో 39.9, ఇటిక్యాలలో 39.3, మల్దకల్, గద్వాలలో లో 38.9, ఉండవెల్లిలో 38.8, అయిజలో 38.8, అలంపూర్‌లో 38.7, రాజోలిలో 38.3, మానవపాడులో 37.7, గట్టులో 36.8 డిగ్రీలుగా నమోదైంది. మహబూబ్ నగర్ జిల్లా అంతటా 40 డిగ్రీలలోపే గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతుంది. జిల్లాలో అత్యధికంగా బాలానగర్, సీసీకుంట మండలాలలో 40 డిగ్రీలు నమోదు కాగా, మిడ్జిల్, గండీడ్, అడ్డాకులలో 39.6 డిగ్రీలు, దేవరకద్ర, మూసాపేట మండలాలలో 38.7, భూత్పూర్‌లో 38.4, జడ్చర్లలో 38.2, మహబూబ్‌నగర్ అర్బన్‌లో 37.6 డిగ్రీలు నమోదవగా, నవాబ్‌పేట మండలంలో 34.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి జిల్లా పెబ్బేరులో 39.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. పాన్‌గల్‌లో 39.4, చిన్నంబావి 39.3, వనపర్తి 39.2, పెద్దమందడి 39.1, గోపాల్‌పేట, అమరచింతలలో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్ కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలంలో 39.7, నాగర్‌కర్నూల్‌లో 39.3, పెద్దకొత్త పల్లిలో 39.0, చారకొండలో 38.6, కల్వకుర్తిలో 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లా నర్వలో 37 డిగ్రీలు, కోస్గిలో 34, మక్తల్ లో 36 డిగ్రీలు, కృష్ణలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఈతకు వెళ్లి యువకుడి మృతి



లక్ష్మణ్ నాయక్ (ఫైల్)

బిజినేపల్లి, ఏప్రిల్ 13 : ఈత సరదా యువకుడి ప్రాణం తీసింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఇప్పల తండాకు చెందిన కేతావత్ లక్ష్మణ్ నాయక్(18) ఈతకు వెళ్లి నీటమునిగి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన ప్రకారం. శనివారం ఐదుగురు స్నేహితులతో కలిసి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా వట్టెం సమీపంలో రిజర్వాయర్ గుంతలోని నీటిలో ఈతకు వెళ్లాడు. సరదాగా ఈత కొడుతూ క్షణాల్లో నీట మునిగాడు. విషయాన్ని స్నేహితులు కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తెలిపారు. గ్రామస్థులు మృతదేహం కోసం నీటిలో వెతుకుతున్నారు. రాత్రి 9 గంటల వరకూ మృతదేహం లభించలేదు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు అంజ్యానాయక్, బుడ్డిలు కన్నీరు మున్నీరుగా విలపించడం పలువురు కంటి తడిపెట్టారు. ఈ ఘటనపై ఇప్పటి వరకు తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రతీ ఓటరును కలవాలి

» ఇంటింటికీ వెళ్లి బీజేపీ పథకాలు వివరించాలి : ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

కొత్తకోట/ఆత్మకూరు, ఏప్రిల్ 13 : ప్రతీ ఓటరును కలుసుకొని ప్రధాని నరేంద్రమోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలియజేయాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ సూచించారు. కొత్తకోట పట్టణంలో శనివారం కొత్తకోట, మదనాపురం, అడ్డాకుల మండలాల బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లుగా దేశరక్షణ, అభివృద్ధిని గమని స్తున్న ప్రజలు మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని కావాలని కోరుతున్నారని అన్నారు. అప్పుల కుప్పగా మారిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. రైతు సంక్షేమ కోసం ఎకరాకు రూ.18 వేల వరకు సబ్సిడీ ఎరువులు, మహిళల అభివృద్ధి కోసం మహిళా సంఘాలకు స్వయం ఉపాధి రుణాలు అందించారని తెలిపారు. రేషన్ దుకాణాల ద్వారా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఐదు కిలోల బియ్యం ఉచితంగా ఇస్తున్నారని, వచ్చే ఐదేళ్లు కూడా ఇస్తామని మోదీ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఉచిత బస్సు హామీతో అన్ని చేసినట్లు సంబురపడుతున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో కాంగ్రెస్ లేదు రాహుల్‌గాంధీ ప్రధాని కాలేరని అన్నారు. అయోధ్య రామయ్య సొంత ఇంటికి రావడానికి 500 ఏళ్లు పట్టిందని, దీనికి కాంగ్రెస్ చేతగాని తనమే నిదర్శనమని శ్రీరామ నవమి వేడుకల్లో ప్రజలకు చెప్పాలన్నారు. అంతకు ముందు అప్పరాల, ఆత్మకూరులో బీఆర్ఎస్ నాయకులకు ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అప్పరాల విష్ణువర్ధన్‌రెడ్డి ఆత్మకూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీకుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ వల్లభదాస్ లావణ్య, స్థానికులు ఉన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, నాగూరావు నామోజీ, పవన్ కుమార్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, బాలన్న, నారాయణమ్మ, భరత్ భూషణ్, బీజేపీ వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎద్దుల రాజవర్ధన్ రెడ్డి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్, అశోక్ కుమార్, సూరి, చందు, రాము పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ సేవలు
చిరస్థాయిగా నిలుస్తాయి

» కార్యకర్తలతోనే బీఆర్ఎస్ గెలుపు సాధ్యం » హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం

» పాలమూరు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పాలమూరు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌ఆర్ రెడ్డి, ఆల, లక్ష్మారెడ్డి, అంజయ్యయాదవ్, చిట్టెం, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

దేవరకద్ర, ఏప్రిల్ 13 : తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో దేవరకద్ర, కౌకుంట్ల మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పాలమూరు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మండలంలోని ప్రతీ కార్యకర్త కష్టపడితేనే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధ్యమవు తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఎంతో బాగుపడిందని, రైతులకు, ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా కేసీఆర్ చూసుకునేవారని అన్నారు. కాంగ్రెస్ పథకాలను నమ్మి ప్రజలు ఓటు మోసపోయారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులు తమ పంటలను సాగు చేసే ముందు పెట్టుబడి కోసం వారి ఖాతాల్లో రైతు బంధు పైసలు జమచేసేది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతున్నా నేటికీ రైతులందరికీ రైతుబంధు డబ్బులు జమ చేయలేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవాలంటే ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సుజాత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, మండల నాయకులు, వెంకటేష్, బాల్‌రాజు, కొండరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఆంజనేయులు ఖాదీర్, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కల్వకుర్తిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

చారకొండ/కల్వకుర్తి/వెల్దండ, ఏప్రిల్ 13: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణ, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర మల్లు రవి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని జూపల్లిలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, జిల్లా మైనార్టీ నాయకులు ముస్తఫముజ్జుబాయి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేలతో పాటు, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిలకు డప్పు, బ్యాండు మేళాలతో పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. మాజీ మంత్రి చి త్తరంజన్‌దాస్, జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు ఇందిరశోభన్, చారకొండ, వెల్దండ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జమ్మికింది బాల్‌రాంగౌడ్, మోతిలాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్‌కుమార్, శేరి అప్పారెడ్డిపల్లి, వెల్దండ మాజీ సర్పంచులు రంగారెడ్డి, భూపత్‌రెడ్డి, సాంబయ్యగౌడ్, జేసిబీ వెంకటయ్యగౌడ్, రాములుయాదవ్, పర్వత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మాధవరెడ్డి, కడారి మల్లయ్య, అక్కి వెంకటయ్య పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీయే కేంద్రంలో అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో పేదలకు అందుతాయని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి ఎన్నికల ప్రచారం శనివారం కల్వకుర్తి పట్టణంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి నిర్వహించారు. మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్‌బాలాజీసింగ్, పార్లమెంట్ ఎన్నికల పరిశీలకురాలు ఇందిరాశోభన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, నాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సుభిక్ష పాలన

కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం, దేశంలోని ప్రజలు సుభిక్షంగా ఉంటారని నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లాపరిషత్ వైఎస్ చైర్మన్ బాలాజీసింగ్‌లతో కలిసి మల్లురవి వెల్దండ మండలకేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, నాయకులు భూపతిరెడ్డి, వెంకటయ్యగౌడ్, మోతీలాల్, సంజీవ్‌కుమార్, పర్వత్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన 54 మంది బీఆర్ఎస్ నాయకులు మల్లురవి, కశిరెడ్డి నారాయణరెడ్డి, బాలాజీసింగ్‌ల సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మాజీ కోఆప్షన్ యాఖుబ్, క్యాసారపు వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సిర్సనగండ్ల సీతారాముల కల్యాణోత్సవానికి రావాలని సీఎంకు ఆహ్వానం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిర్సనగండ్ల ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి సన్మానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆలయ అధికారులు

అచ్చంపేట, ఏప్రిల్ 13: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సొంత ప్రాంతమైన వంగూరు ఉమ్మడి మండల పరిధిలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 17న జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి హాజరు కావాలని కోరుతూ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆహ్వాన పత్రికను హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శనివారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సీఎంను శాలువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు భీముడు నాయక్, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గంజాయి

- నల్లమలలో అంతరపంటగా సాగు
- హైదరాబాద్, చెన్నై, ముంబయిలకు రవాణా చేస్తున్న స్మగ్లర్లు
- టినేజర్లను లక్ష్యంగా చేసుకొని సాగుతున్న వ్యాపారం



నాగర్‌కర్నూల్‌లో శుక్రవారం గంజాయిని పట్టుకున్న పోలీసులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జి ల్లాలో గంజాయి గుప్పుమంటోంది. నల్లమలను కేంద్రంగా చేసుకుని అంతరపంటగా గంజాయిని సాగు చేస్తున్నారు. టినేజర్లను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయాలు జరుగుతుండడంతో వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. నల్లమలలోని లోతట్టు అటవీ ప్రాంతా ల్లో కొందరిని చేరదీసి స్మగ్లర్లు అంతరపంటగా గంజాయిని సాగు చేయి స్తున్నారు. గంజాయిని ఎండబెట్టిన తర్వాత పోలీసులకు, ఎక్సైజ్ అధికారు లకు అనుమానం రాకుండా ఆర్టీసీ బస్సుల్లో జిల్లా సరిహద్దులు దాటిస్తు న్నారు. హైదరాబాద్‌తోపాటు చెన్నై, ముంబయి నగరాలకు గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. కిలో గంజా యి 6 నుంచి 7వేల రూపాయలు ధర పలుకుతుండడం తో స్మగ్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు.

● బయటపడుతున్న కేసులు

జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో గంజాయి పట్టుబడుతున్న కేసులు క్రమంగా బయటకు వస్తున్నాయి. 2023 నవంబరులో కల్వకుర్తి ప ట్టణంలో గంజాయి తాగుతుండగా పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. ఏప్రిల్ 5న అమ్రాబాద్ మండలం తుర్కపల్లిలో ఓ కౌలు రైతు పొ లంలో అంతర పంటగా గంజాయిని సాగు చేయ గా ఎక్సైజ్ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. శుక్రవారం పెద్దకొత్తపల్లికి చెందిన విశ్వప్రసాద్ అనే స్మగ్లర్‌ను నాగర్‌కర్నూల్ పోలీసులు అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

గంజాయి నిరోధానికి ప్రత్యేక బృందాలు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.గాయత్రి

జిల్లాలో గంజాయిని నిరోధించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. నల్లమలలోని లోతట్టు ప్రాంతాల్లో అంతరపంటగా గంజాయిని సాగు చేస్తున్న వారి వివరాలు తెలుసుకునేందుకు టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేశాం. హైదరాబాద్‌తోపాటు ప్రధాన నగరాలకు గంజాయిని తరలిస్తున్న స్మగ్లర్ల వివరాలు పోలీసుల ద్వారా సేకరిస్తున్నాం.

తాగిన మత్తులో మేస్త్రి ఆత్మహత్య

కొత్తకోట, ఏప్రిల్ 13 : తాగిన మత్తులో ఓ మేస్త్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం రేమద్దులకు చెందిన వెంకటయ్య(38) తన భార్య తిరుపతమ్మతో కలిసి కొంతకాలంగా కొత్తకోటలో అత్తగారింట్లో ఉంటున్నాడు. ఈ ఏడాది కుమారుడు మృతి చెందడంతో మద్యానికి ఆలవాటు పడ్డాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి భార్యభర్తలు గొడవపడ్డారు. అనంతరం ఆమె పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా బయట నుంచి తలుపులకు చిలుకు పెట్టి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్నట్లుఎస్సై తెలిపారు.

పెద్దూరులో మహిళ..

తెలకపల్లి : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని పెద్దూరులో ఓ మహిళ ఆత్మహత్య చేసుకు న్న సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పార్వతమ్మ(28) శనివారం సాయంత్రం స్థానిక పాఠశాల ఆవరణలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. బావిలో ఉన్న శవాన్ని బయటకు తీసి జిల్లా ఆసుపత్రికి తరలించి నట్లు వారు తెలిపారు. సంఘటనపై ఇంకా ఫిర్యాదురాలేదని, ఆత్మహత్యకు దారి తీసిన సంఘటన వివరాలు తెలియరాలే దని వారు తెలిపారు. ఈమెకు భర్త చెన్నయ్య, పిల్లలు ఉన్నట్లు తెలిసింది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజోళి, ఏప్రిల్ 13 జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని రాజోళి గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజోళి గ్రామానికి చెందిన రామలింగం తన ట్రాక్టర్ ద్వారా తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వ హించామన్నారు. ఇసుక ట్రాక్టర్‌కు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి రామలింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిరాణ దుకాణంలో మద్యం స్వాధీనం

గద్వాల క్రైం/రాజాపూర్, ఏప్రిల్ 13 : వేర్వేరు చోట్ల కిరాణం దుకాణాల్లో మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని రేకులపల్లి గ్రామంలో వాకిటి వెంకటన్న అనే వ్యక్తి తన కిరాణ దుకాణంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి, ఎస్సై వెంకటేష్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. కిరాణం దుకాణంలో ఉన్న 3.9 లీటర్ల లిక్కర్‌ను, 4.4 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకొని వాకిటి వెంకటన్నపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా, మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లోని ఓ కిరాణ దుకాణంలో మద్యాన్ని విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఓ కిరాణా దుకాణంలో మొత్తం 25 బాటిళ్ల మద్యం కనిపించ గా స్వాధీనం చేసుకొని మద్యం విక్రయి స్తున్న కటిక నిర్మలమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అటవీ జంతువుల రక్షణ అందరి బాధ్యత

» ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఫర్వేజ్ అహ్మద్

బిజినేపల్లి, ఏప్రిల్ 13 : అటవీ జంతువుల రక్షణ మన అందరి బాధ్యత అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఫర్వేజ్ అహ్మద్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని గంగారం ఫారెస్ట్ సమీపంలోని కీమ్యా తండాలో శనివారం సాయంత్రం చిరుత పులుల సంచారంతో ఆందోళన చెందవద్దని అవగాహన కల్పించి మాట్లాడారు. అటవీలో జింకలు, అడవి పందులు ఉండడంతోనే ఘనపూర్ అడవి నుంచి గంగారం ఫారెస్ట్‌లోకి చిరుతలు వచ్చాయని అన్నారు. చిరుత పులులు సంచారంతో అటవీ అభివృద్ధి చెంది ఈప్రాంత పర్యావరణంలో సానుకూలమైన మార్పులు వస్తాయన్నారు. అలాగే అడవులు పెరగడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. అడవిలోని జింకల గుంపులు పంట పొలాలపై పడి నాశనం చేస్తున్నాయని తండా ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అడవిలోంచి పొలాలకు రాకుండా అవసరమైన కంచె వేయించేందుకు ఉన్నతాధికారులకు ప్రపోజల్స్ పంపుతానని హామీ ఇచ్చారు. అటవీ సమీపంలో ఉన్న తండాల ప్రజలు రాత్రి సమయాల్లో ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దని సూచించారు. అలాగే జంతువుల ప్రాణాలకు హాని కల్గిస్తే అటవీ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. అవసరమైతే బోన్లు ఏర్పాటు చేసి చిరుతలను బంధించి నల్లమలలో వదిలే ఏర్పాట్లు చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం వైల్డ్ లైఫ్ రిస్క్ టీంతో కలిసి వాహనంలో రాత్రికి బస చేసి చిరుతల కదలికలను పరిశీలిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎఫ్ఎస్‌వో చంటి, బీట్ ఆఫీసర్లు మోహన్, ప్రవీన, వైల్డ్ లైఫ్ రిస్క్ టీం సభ్యులు బయోలజిస్ట్ రవికాంత్, అసిస్టెంట్ బాలస్వామి, ఖాజాలు ఉన్నారు.


కీమ్యాతండాలో ప్రజలకు అటవీ జంతువుల ఆవశ్యకతను వివరిస్తున్న ఎఫ్ఆర్‌వో ఫర్వేజ్ అహ్మద్

21న అరుణాచలగిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సు

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 13 : ఈనెల 21న అరుణాచలం గిరి ప్రదక్షిణకు మహబూబ్‌నగర్ నుంచి బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుజాత తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రోధినామ సంవత్సరం, చైత్రమాసం, వసంత రుతువు పౌర్ణమి సందర్భంగా ఈ నెల 22న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును మహబూబ్‌నగర్ డిపో నుంచి నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ బస్సు 21న సాయంత్రం 5 గంటలకు మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి బయలుదేరి 22న ఉదయానికి కాణిపాకం చేరుకుంటుందని, అక్కడ విఘ్నేశ్వరుని దర్శనానంతరం బయలుదేరి మధ్యాహ్నానికి వేలూరు గోల్డెన్ టెంపుల్‌కు చేరుకొని దర్శనం అనంతరం సాయంత్రానికి అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అరుణాచలేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ, దర్శనానంతరం 23న మధ్యాహ్నం 2 గంటలకు తిరుగు ప్రయాణమై ఏప్రిల్ 24న ఉదయం 5 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటుందని తెలిపారు. అరుణాచల గిరి ప్రదర్శనను టూర్ ప్యాకేజీలా ఆర్టీసీ అందిస్తోందని, ఈ ప్యాకేజీ ధరలను ఒక్కొక్కరికి రూ.3300గా సంస్థ నిర్ణయించిందని, అన్ని సెస్ చార్జీలు, బోర్డర్ టాక్స్‌లు, టోల్ టాక్స్‌లు కలుపుకొని టూర్ ప్యాకేజీగా అందిస్తుందని తెలిపారు. ఈ టూర్ ప్యాకేజీని ముందస్తుగా మహబూబ్‌నగర్ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చని, ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం 9441162588, 7382827102 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

చిత్తనూర్ ఇథనాల్ పరిశ్రమ రద్దు కోసం

18న రౌండ్‌టేబుల్ సమావేశం

పాలమూరు, ఏప్రిల్ 13 : తక్షణమే చిత్తనూర్ ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం. రాఘవాచారి, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చిత్తనూర్ ఇథనాల్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై చర్చించేందుకు 18వ తేదీన హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పండ్ల రసాల కంపెనీ పేరుతో పనులు ప్రారంభించినప్పటి నుంచి ఆ కంపెనీకి చాలా దగ్గరలో ఉన్న చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారం గ్రామాల రైతాంగం, ప్రజలు నిరంతరం శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులలో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమానికి తోడుగా చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పడిందని, పెద్దఎత్తున పార్టీల, ప్రజాస్వామ్యవాదుల, శాస్త్రవేత్తల మద్దతు కూడగట్టిందని వారు తెలిపారు. ఈ ఉద్యమం సాగుతుండగానే రాష్ట్రంలో 20కి పైగా ఇథనాల్ పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయని, అన్నిచోట్ల కాలుష్య సమస్యపై స్థానిక రైతాంగం ఆందోళనలు చేపడుతున్నట్లు అర్థమవుతోందన్నారు. ఇథనాల్ ఉత్పత్తిని, ఆ కంపెనీలు, రైతాంగం స్థానిక ప్రజలు తమ అనుభవం రీత్యా కాలుష్య సమస్యగానే చూస్తున్నట్లు తెలిపారు. ఇథనాల్ పరిశ్రమ తీవ్రతపై చర్చించడానికి తెలంగాణ పర్యావరణ భవిష్యత్తును కాపాడుకునే కార్యాచరణ రూపొందించడానికి రౌండ్‌టేబుల్ సమావేశంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని షోషట్ హాలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా..

» చెర్కూర్‌లో 10 ఇళ్లలో చోరీలు

» రూ.రెండు లక్షల నగదు, తులంన్నర బంగారం అపహరణ

వెల్దండ, ఏప్రిల్ 13 : మరోమారు మండలంలో దొంగలు రెచ్చిపోయారు. గత మూడు నెలల క్రితం పలుగ్రామాల్లో జరిగిన వరుస చోరీలు ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేశాయి. గతంలో జరిగిన దొంగతనాల నుంచి తేరుకోకముందే మరోమారు శుక్రవారం రాత్రి చెర్కూర్ గ్రామంలో ఏకంగా పది ఇళ్లలో జరిగిన చోరీలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాళాలు వేసిఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడడం జరుగుతుంది. ప్రధానంగా ప్రధాన రహదారిని అనుసరించుకుని జరుగుతున్న చోరీలు స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై ఉన్న చెర్కూర్ గ్రామంలో జరిగిన దొంగతనాలు మరోమారు చర్చించుకునేలా చేశాయి. ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు వెళ్లిన ఇళ్ల తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు ప్రధానంగా బీరువాలలో ఉన్న నగదు, బంగారాలను తస్కరించారు. గ్రామానికి చెందిన ద్యాప పార్వతమ్మకు చెందిన లక్ష రూపాయలు, దొడ్ల అల్లాజికి చెందిన 50వేలు, గోలి దశరథంకు చెందిన 32వేల నగదు, 12 గ్రాముల బంగారం, బుర్ర రమేష్‌కు చెందిన 20వేల నగదు, అరతులం బంగారం, చంద్రారెడ్డికి చెందిన 8వేల నగదును దొంగలు అపహరించినట్లు బాధితులు తెలిపారు. అదేవిధంగా జంగయ్య, దేవయ్య అలివేలు, బుచ్చమ్మ, నరేందర్‌కు చెందిన ఇళ్ల తాళాలు పగులగొట్టినా ఎటువంటి నగదు, బంగారం పోలేదని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో చోరీల విషయం తెలుసుకున్న వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ ఎం.రవి గ్రామానికి చేరుకుని విచారణ జరిపారు. అనంతరం క్లూస్‌టీంను రప్పించి విచారణ చేశారు. ఈ మేరకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


బీరువాను పగులగొట్టి చోరీకి పాల్పడిన దొంగలు

ఇంటి పైకప్పు రేకులే షార్ట్ సర్క్యూట్‌కు కారణం

» విద్యుత్ శాఖ ఏఈ శ్రీరాములు

తాడూరు, ఏప్రిల్ 13 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామంలో ఇద్దరు తోడికోడళ్లు విద్యుత్‌ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఇందుకు సంబంధించి శనివారం విద్యుత్ శాఖ ఏఈ ఘటన స్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్‌స్తంభంపై నుంచి సర్వీస్ వైరును పరిశీలిస్తూ రేకులపై చూడగా ఎలక్ట్రికల్ షాపునకు సంబంధించి పైకప్పు పరిశీలిస్తుండగా రేకులపై విద్యుత్ వైరు తెగి షార్ట్ సర్క్యూట్ అయినట్లుగా గుర్తించారు. రేకులపై విద్యుత్ వైర్లు ఉండడం మూలంగా గాలికి వైరు రేకులపై రాపిడి జరిగి వైరుకు సంబంధించిన పైభాగం తేలిందన్నారు. కాబట్టి ఇనుప పైపులకు కాని, రేకులకు కాని, ఇనుప వస్తువులకు ఏ దానికి విద్యుత్ వైర్లను కట్టకూడదని సూచించారు. వారి మృతి వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపిందన్నారు. ఎవరైనా సరే తరచూ సర్వీస్ వైర్లను పరిశీలించుకుంటూ ఉండాలని, మరీ ముఖ్యంగా వర్షాలు పడుతున్న సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు.


ఐతోల్‌లో ఇద్దరు తోడికోడళ్ల మృతికి కారణమైన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన ప్రదేశం

సారా, కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు

» ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్

» ఆంధ్ర - తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు

» ఐదుగురిపై కేసు నమోదు

దోమలపెంట, ఏప్రిల్ 13: అనుమతి లేకుండా బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు, కల్తీ కల్లు, సారా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్ హెచ్చరించారు. శనివారం తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ ఇరు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా దోమలపెంట, ఈగలపెంట, ఎడమ పాతాలగంగ గ్రామాల్లో దాడులు నిర్వహించి 85 లీటర్ల మద్యం, 71 లీటర్ల కల్తీ కల్లు, 5లీటర్ల సారా ధ్వంసం చేశారు. నాగులు, తిమ్మారెడ్డి, శివ, రాజు, చాందినిలపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్‌శాఖ అధికారులు, పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మద్యం ధరలు తక్కువ గా ఉన్నందున దోమలపెంట మద్యం దుకాణం నుంచి కొంతమంది వ్యాపారులు సున్నిపెంటకు మద్యం సరఫరా చేస్తున్నారని నంద్యాల జిల్లా అధికారులకు ఫిర్యాదులు రావడంతో ఆంధ్ర- తెలంగాణ ఎక్సైజ్‌శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించామని నంద్యాల డీపీఈవో రామోహన్ పేర్కొన్నారు. ఈ దాడుల్లో అచ్చంపేట ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య, డీటీఎఫ్ కళ్యాణ్, ఇన్‌స్పెక్టర్స్ శారద, ఎస్ఐలు సతీష్‌కుమార్, అరుణ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాహనాల తనిఖీ

» పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద రూ.2,12,430, లాల్‌కోట చెక్‌పోస్టు వద్ద రూ.5.74 లక్షలు, బాలానగర్ చెక్‌పోస్టు వద్ద రూ.50 వేలు నగదు పట్టివేత

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 13 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్ గ్రామ శివారు ప్రాంతంలోని ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం ఎస్సై శ్రీహరి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల నెంబర్లకు సంబంధించిన పత్రాలను సెల్‌ఫోన్‌లో ఎస్సై పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీహరి మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తు వాహనానికి సంబంధించిన అనుమతి పత్రాలను పొంది ఉండాలని సూచించారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని అన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై హెచ్చరించారు.

పుల్లూరు టోల్ ప్లాజా వద్ద..

అలంపూర్ చౌరస్తా : గద్వాల జిల్లా ఉండవల్లి మం డల పరిధిలోని ఏపీ తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఎన్నికల నేపథ్యంలో నిర్వ హిస్తున్న తనిఖీల్లో రూ. 2,12,430 నగదును పట్టు కున్నట్లు ఉండవల్లి ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కర్నూల్ నగరంలో ఉషా గ్యాస్ ఏజెన్సీలో మేనేజర్‌గా పనిచేస్తున్న అన్యం శశికాంత్‌రెడ్డి అనే వ్యక్తి శనివారం సాయంత్రం పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద యుటర్న్ తీసుకునేందుకు ఇటు వైపు కారులో వచ్చాడు. యుటర్న్‌కు ముందే ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండటంతో తనిఖీ చేయగా సదరు వ్యక్తి వద్ద రూ. 2,12,430లు గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా ఏపీలోకి వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తుండగా అయిజ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న షేక్ అస్లాంబాష అనే వ్యక్తి వద్ద రూ.63వేలు స్వాధీనం చేసుకున్నారు. నగదును గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.


సోలీపూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీహరి

లాల్‌కోట చెక్‌పోస్టు వద్ద...

నారాయణపేట రూరల్/మరికల్ : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ చెక్‌పోస్టు దగ్గర శనివారం రూ.3.84 లక్షల నగదును పోలీసులు పట్టు కున్నారు. యాద్గీర్ జిల్లాకు చెందిన వాకిటి వెంకటప్ప దగ్గర రూ.92 వేలు, ఉజ్జల్లి మహానూర్ మండలానికి చెందిన వి.రాజు దగ్గర రూ.1.50 లక్షలు, యాద్గిర్ జిల్లా కేసరి గ్రామానికి చెందిన హన్మంతు దగ్గర ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టు వద్ద రూ.1.42 లక్షల నగదు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరి దగ్గర ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బులను గ్రీవియస్ కమిటీకి అప్పజెప్పడం జరిగిందన్నారు. అదే విధంగా మరికల్ మండలం లాల్‌కోట చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ ల్లో యాద్గీర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఎండీ ఉమర్, సయ్యద్ అహ్మద్‌తో మొత్తం రూ.1,90,000 లక్షలు పట్టుకొని గ్రీవియస్ కమిటీకి అప్పగించినట్లు ఎస్ఐ మురళి తెలిపారు.

బాలానగర్ చెక్ పోస్ట్ వద్ద...

బాలానగర్ : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా బాలానగర్ పోలీసులు జాతీయ రహదారిపై వివిధ వాహనాలను శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.50 వేలు పట్టు పబడినట్లు ఎస్ఐ తిరుపాజి తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి మండల కేంద్రానికి చెందిన శివశంకర్ హైదరాబాద్‌కు వ్యాపార కార్యక్ర మంలో భాగంగా అనంతపురం నుంచి హైదరాబాద్‌కు బొలెరో వాహనం ద్వారా రాకపోకలు సాగిస్తాడు. హైదరాబాద్ నుంచి అనంతపురం వెళ్తుండగా బాలానగర్ చెక్ పోస్ట్ వద్ద అతని బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా రూ.50వేలు నగదు కనిపించడంతో స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గట్టు, ఏప్రిల్ 13 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గద్వాల జిల్లా గట్టు మండలంలో శనివారం చోటు చోటు చేసుకున్నది. హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముచ్చోనిపల్లి గ్రామానికి చెందిన కుర్వ ఈరన్న(41) ఈనెల తొమ్మిదో తేదీన ద్విచక్ర వాహనంపై వెళ్తూ మిట్టదొడ్డి గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దాంతో గాయపడిన ఈరన్నను కర్నూలు జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య కుర్వ సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

హైదరాబాద్‌లో ఆర్ఎంపీ డాక్టర్..

వనపర్తి రూరల్, ఏప్రిల్ 13 : చికిత్స పొందుతూ ఆర్ఎంపీ డాక్టర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన రమేష్(33) వనపర్తి పట్టణంలోని మర్రికుంట కాలనీలో ఆర్ఎంపీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల ఒకటో తేదీన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై దత్తాయిపల్లి గ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో ఒక అడవి పంది అడ్డు రావడంతో దానిని తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య నర్మద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పాత కక్షలతో చెవి కొరికేశాడు

» పోమాలలో ఘటన, పోలీసులకు ఫిర్యాదు

నవాబ్‌పేట, ఏప్రిల్ 13 : పాతకక్షలు మనస్సులో పెట్టుకొని ఓ వ్యక్తి మరో వ్యక్తి చెవి కొరికాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం పోమాల గ్రామంలో శనివారం జరిగింది. బాధితుడు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.గ్రామంలో పిడుగు ప్రదీప్, కారుకొండ సాయిలుకు గతంలో గొడవపడి, పాతకక్షలు ఉన్నాయి. ప్రదీప్ శనివారం ఉదయం గ్రామంలోని వాటర్ ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటుండగా సాయిలు వెనకాల నుంచి ప్రదీప్ మెడ కొరికేందుకు యత్నిస్తుండగా పెనుగులాటలో చెవి కొరికాడు. గ్రామస్థులు చూస్తుండగానే ఈ సంఘటన జరిగింది. ప్రదీప్‌కు రక్తస్రావం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం

గండీడ్, ఏప్రిల్ 13 : మహిళ అదృశ్యమైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం పగిడ్యాల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పగిడ్యాల్ గ్రామానికి చెందిన ఎరుకల పెంటమ్మ తన చెల్లెలిని దేవరకద్ర మండలం మానసపల్లి గ్రామంలోని వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కొన్నేళ్ల క్రితం వారు చనిపోయారు. వారి కూతురు రాధమ్మను పెంటమ్మ పగిడ్యాల్‌కు తెచ్చుకొని పెంచి, పెద్దచేసి ఇటీవల అదే గ్రామంలోని శ్రీను అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. మద్యానికి బానిసైన అతను రాధమ్మను వేధిస్తున్నాడు. ఆ బాధలు భరించలేక ఈనెల 11వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు షాపునకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. ఎంతకూ ఇంటికి తిరిగి రాలేదని పెంటమ్మ ఆందోళనతో ఉండగా, అదేరోజు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రాధమ్మ ఫోన్ చేసి దేవరకద్ర మండలం అజిలాపూర్ గ్రామానికి వచ్చినట్లు చెప్పింది. అక్కడ నరసింహ అనే వ్యక్తి వద్ద ఉన్నట్లు చెప్పింది. పెంటమ్మ అజిలాపూర్ గ్రామానికి వెళ్లి వెతకగా మహిళ ఆచూకీ తెలియకపోవడంతో శనివారం మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గద్వాల, ఏప్రిల్ 13: గద్వాల మండల పరిధిలోని అనంతాపురం గ్రామానికి చెందిన ఉప్పరి ఉపేంద్ర అనే యువకుడు ఓ గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై పర్వతాలు శనివారం తెలిపారు. గతంలో కూడా ఈ యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి వెంట తీసుకెళ్లినందుకు మహబూబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు అయినట్లు సమాచారం.

కాపురానికి రమ్మని పిలవడానికి వెళ్తే దాడి

అమరచింత, ఏప్రిల్ 13 : కొద్దిరోజులుగా అత్తమామల వద్దే ఉంటున్న తన భార్యను కాపురానికి రమ్మని పిలవడానికి వెళ్తే దాడి చేశారని భర్త అమరచింత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా అమరచింత మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మహిళతో కొన్ని సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్ని రోజులుగా భర్తతో గొడవపడి అదే గ్రామంలో ఉన్న తల్లిదండ్రుల వద్ద భార్య ఉంటుంది. శనివారం సాయంత్రం రవి తన భార్యను కాపురానికి రమ్మని పిలవడానికి అత్త, మామ ఇంటికి వెళ్లగా ఆగ్రహంతో వారు దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో గాయపడిన రవి అమరచింత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 13: గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరు గ్రామ శివారులో గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గ్రామ శివారులో గృహాలకు సమీపంలో దుర్వాసన వస్తుండటంతో స్థానికులు అనుమానాస్పదస్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని కానిస్టేబుల్ ఉస్సేన్, ఖాదర్‌బాషా పరిశీలించారు. సదరు వ్యక్తి స్కై బ్లూ కలర్ పాయింట్ మాత్రమే ఉందని, ఒక చేయిని కుక్కలు తిన్నట్లుగా ఆనవాలు గుర్తించారు. మూడురోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ ఆసుపత్రికి తరలించారు.

ఆలయంలో చోరీ

మానవపాడు, ఏప్రిల్ 13: గద్వాల జిల్లా మానవపాడు మండలం అమరవాయి గ్రామంలోని ఆలయంలో చోరీ జరిగింది. శనివారం ఎస్సై చంద్రకాంత్, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామ ప్రధాన కూడలిలో ఉన్న శివాలయంలో శనివారం ఉదయం పూజరులు పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయానికి తాళం వేసి పూజలు వెళ్లిపోయారు. మళ్లీ సాయంత్రం ఆలయానికి పూజారులు రాగా ఆభరణాలు కనిపించలేదు. నాగపడగలు, ఆంజనేయస్వామి కిరీటం, పరమేశ్వరుడికి సంబంధించిన అయిదు కిలోల వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. పూజారులు ఫిర్యాదు చేయగా ఎస్సై చంద్రకాంత్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలలో బ్యాటరీలు చోరీ

వడ్డేపల్లి, ఏప్రిల్ 13 : గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం కొంకల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు ఆరు బ్యాటరీలను చోరీ చేశారు. పాఠశాలలో కంప్యూటర్ల కోసం బ్యాటరీలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం పాఠశాల తలుపులు ధ్వంసం కావడాన్ని గుర్తించిన గ్రామస్థులు ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. కాగా, పాఠశాలకు వరుసగా సెలవులు ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బ్యాటరీలను చోరీ చేశారని సిబ్బంది తెలిపారు. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు వడ్డేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

అలుముకుంటున్న కరువు

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- సెప్టెంబరు నుంచి ముఖం చాటేసిన వర్షాలు
- రోజురోజుకు పడిపోతున్న భూగర్భ జలాలు
- నీళ్లు లేక వట్టిపోతున్న చెరువులు, వాగులు
- ఇప్పటికే రబీ సాగుతో అప్పుల పాలు

తాడూరు, ఏప్రిల్ 13 : చినుకు లేకుండా పోయిన వరుణుడి ప్రకోపానికి ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లా మొత్తం విలవిలలాడుతున్నది. గత సంవత్సరం అధిక వర్షాలతో జిల్లాలో ఉన్న కృష్ణనదితో పాటు వాగులు, వంకలు, చెరువుల, కుంటలు సైతం జలకళను సంతరించుకుని ఉండగా, ప్రస్తుతం పూర్తిగా అందుకు విరుద్ధంగా కనబడుతున్నది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభ సమయంలో అనుకున్నంత మేర వర్షాలు కురవకపోగా, ఏడాది మొత్తంలో లోటు వర్షపాతం నమోదు కావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఇప్పుడు జిల్లాలో వేస్తున్నటువంటి కరువు ఛాయలు భయభ్రాంతులకు గురి చేస్తున్నది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ప్రారంభానికి ముందు కనబడిన పరిస్థితులు మళ్లీ ఈ ఏడాది చూస్తుండడంతో రానున్న రోజుల్లో గడ్డుకాలంగానే భావిస్తున్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఎక్కడా చుక్కనీరు కనబడకపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులన్నీ డెడ్ స్టోరేజ్‌కు చేరుకోవడంతో ఎటూ పాలుపోనీ పరిస్థితుల్లో జిల్లా యంత్రాంగం ఆందోళన చెందుతున్నారు. పరిస్థితులు ఇలానే ఉన్నట్లయితే జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి అందరినీ ఆదుకోవాల్సిందిగా పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా కాల్వ మొత్తాన్ని ఆరు ప్యాకేజీలుగా విభజించారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న కాల్వలను ప్యాకేజీ-1, అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న కాల్వలకు ప్యాకేజీ-2, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న కాల్వలకు ప్యాకేజీ-3, 4,5గా ఏర్పాటు చేయగా కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో ఉన్న కాల్వలకు ప్యాకేజీ-6గా ఏర్పాటు చేశారు. కేఎల్ఐకు సంబంధించిన ప్రధాన కాల్వ దాదాపుగా వందకిలో మీటర్లకు పైగా ఉండగా అదనంగా సబ్ కెనాల్స్, బ్రాంచ్ కెనాల్స్‌ను సైతం ఏర్పాటు చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లాలో 14మండలాలకు సంబంధించి 2లక్షల 68వేల 165 ఎకరాలకు సాగునీరందనుంది.


తాడూరు మండలం సిర్సవాడ గ్రామం వద్ద నీళ్లు లేక వట్టిపోయిన కేఎల్ఐ చిన్న కాల్వ

● నష్టాలమయంగా యాసంగి సాగు

ఈ ఏడాది వర్షాకాలంలో ఆరంభంలో సమృద్ధిగా వర్షాలు కురవకపోవడం మూలంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రభావంతో యాసంగి సాగుపై తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు వచ్చాయి. గత సంవత్సరం 2023 యాసంగిలో నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 3లక్షల 12వేల 96ఎకరాల్లో పంటలు సాగు చేయగా, 2024 యాసంగిలో మాత్రం దాదాపు లక్ష ఎకరాల్లో సాగు తగ్గి 2లక్షల 36వేల 623 ఎకరాల్లోనే రైతులు పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి లక్షా 228ఎకరాలు సాగు కాగా, వేరుశనగ లక్షా 4వేల 307 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న 15వేల 543 ఎకరాల్లో సాగు చేయగా, కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఎక్కువ మొత్తంలో మినుము పంటను 12వేల 467ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కంది 28ఎకరాలు, పెసర్లు 697ఎకరాలు, సన్‌ఫ్లవర్ 32ఎకరాలు, రాగులు రెండు ఎకరాల్లో, మరి ఇతరత్రా పంటలు సాగవుతున్నాయి. కేఎల్ఐ కాల్వలను నమ్ముకోకుండా బోర్లను, బావులను నమ్ముకుని చాలా మంది రైతులు మొక్కజొన్న, జొన్న, వరితో పాటు మరి ఇతరత్రా పంటలను సాగు చేయగా, తీరా చేతికొచ్చే ముందు సరిపడా సాగునీరు అందకపోవడం మూలంగా చాలా మేరా పంటలన్నీ ఎండిపోతున్నాయి.


ఐతోల్ గ్రామం వద్ద నీళ్లు లేక ఎండిపోతున్న జొన్న పంట

ఇలాంటి పరిస్థితులను చూస్తున్న అన్నదాతలు ఈ గోడును ఎవరికి చెప్పుకోవాలో పాలుపోక ఆందోళన చెందుతున్నారు.

అప్పులు చేసి సాగు చేసిన పంటలన్నీ ఎండిపోతున్న తరుణంలో తిరిగి అప్పులు ఎలా చెల్లించాలన్న సందిగ్ధంలో రైతులు అంతర్మథనంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏదేమైనా ఈ ఏడాది యాసంగి సాగు రైతులను తీవ్ర అప్పుల ఊబిలోకి నెట్టేసినట్లుగా భావిస్తున్నారు.

● దుందుభీ నదిలో సైతం బోర్లు వట్టిపోతున్నాయి



ఈ సంవత్సరం అంతంత మాత్రంగానే వర్షాలు కురవడం మూలంగా దుందుభీ నది ప్రవాహం చాలా తక్కువ రోజులు ప్రవహించింది. దీంతో నదిలో ఉన్న బోరు బావులు ప్రస్తుత వేసవి తాపానికి వట్టిపోతున్నాయి. బోర్లను నమ్ముకుని సాగు చేసిన పంటలు సైతం ఎండుముఖం పడుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పెట్టిన పెట్టుబడులు సైతం వచ్చే దుస్థితి కనబడకపోవడంతో ఆందోళనగా ఉంది. గత సంవత్సరం అధిక వర్షాలతో నష్టపోయి ఈ సంవత్సరం అంతంతమాత్రంగా కురిసిన వర్షాలతో నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది. నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుంది. నాకు ఆరెకరాల భూమి ఉండగా ఇప్పటి వరకు రైతుబంధు సైతం అందలేదు.

- శంకర్‌గౌడ్, ఎట్టిధార్‌పల్లి గ్రామం

● కరువు జిల్లాగా ప్రకటించి ఆదుకోవాలి



ఈ సంవత్సరం ఆరంభం నుంచి అంతంత మాత్రంగానే వర్షాలు కురుస్తుండడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న కృష్ణ, తుంగభద్ర నదులకు సంబంధించిన ప్రాజెక్టుల్లో నీరంతా అడుగంటింది. దీనికి తోడు వాగులు, వంకలతోపాటు గ్రామాల్లోని చెరువులు సైతం వట్టిపోయి తీవ్ర నీటి కొరత ఏర్పడే దుస్థితి నెలకొంటుంది. పరిస్థితులు ఇలాగే ఉంటే వచ్చే రెండు మూడు నెలల్లో సమృద్ధిగా వర్షాలకు కురవకపోతే ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న అన్ని జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించి అన్నదాతలను ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుంది. లేకుంటే తిరిగి గతంలో మాదిరే మళ్లీ వలసలు పోయే ప్రమాదం నెలకొంటుంది. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవడంతోపాటు కరువు జిల్లాగా ప్రకటించే ప్రతిపాదనలను పరిశీలిస్తే బాగుంటుంది.

- వార్ల వెంకటయ్య రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి

ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి


ఆలేరులో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తెలకపల్లి, ఏప్రిల్ 13 : ప్రజలందరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలేరులో శనివారం ఆయన అంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ దైవభక్తి కలిగి ఉండాలని, అప్పుడే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆలేరు మాజీ సర్పంచ్ వంశవర్ధన్‌రావు, జడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, బాలస్వామి, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బీజేపీని గద్దె దించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ


సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 13: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ దేశంలో గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏనాడు పేదల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోలేదన్నారు. ఆర్ఎస్ఎస్ మనువాద ఎజెండాను అమలు చేస్తూ దేశం లో కుల, మత ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుతోందని విమర్శించారు. మళ్లీ మూడోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యమే లేకుండా చేయడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, నాయకులు ఆంజనేయులు, ఆర్‌శ్రీను, దేశ్యానాయక్, మల్లేష్, నరసింహ, శంకర్‌నాయక్, ఈశ్వర్, శివవర్మ, అశోక్, కాశన్న, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతమైన రక్తదాన శిబిరం

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే.సుధాకర్‌లాల్


రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రం అందజేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే సుధాకర్‌లాల్

కందనూలు, ఏప్రిల్ 13 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్‌లో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, సమత సైనిక్ దళ్ నాగర్‌కర్నూల్ జిల్లా శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే సుధాకర్‌లాల్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడారు. యువకులు, యువజన సంఘాలు బాధ్యత తీసుకుని రక్తదాన శిబిరాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూన గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి తగిలి వెంకటపతి, గౌరవ అధ్యక్షుడు గుడిపాటి ప్రభాకర్, కోశాధికారి గీత మల్ల కోటేశ్వర్, సమతా సైనిక జిల్లా బాధ్యులు సామ రమేష్, మేవ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే టీఎస్‌యూటీఎఫ్ ధ్యేయం



టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 13: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమమే టీఎస్‌యూటీఎఫ్ ధ్యేయమని ఆ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీధర్‌శర్మ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యూనియన్ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దశాబ్ద కాలంలో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ఎన్నో సదస్సులు, సమావేశాలు నిర్వహించి అందులో చేసిన తీర్మానాలను ప్రభుత్వానికి సమర్పించడం ద్వారా రాష్ట్ర విద్యారంగంలో నెలకొన్న సమస్యలకు అనేక పరిష్కారాలు చూపిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో విద్యారంగ సమస్యల పోరాటంతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకుడు తిరుపతయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.లక్ష్మయ్య, సత్యనారాయణ, నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, రమాదేవి, వహీద్‌ఖాన్, చంద్రశేఖర్, ఎం.శ్రీనివాసులు, కురుమయ్య, శేషగిరి, సునీల్‌కుమార్, ఆర్.సత్యం, శివకుమార్, సింగోటం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

అచ్చంపేట, ఏప్రిల్ 13: అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 20 తేదీ వరకు నిర్వహించనున్నట్లు సీఐ రవీందర్ అన్నారు. శనివారం అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి రంగస్వామితో కలిసి ఆయన అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ నేటి నుంచి వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలో ప్రతి రోజు అగ్ని ప్రమాదాలపై కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందులు లేకుండా ప్రాణాలు కాపాడునేలా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాము, ఆంజనేయులు, బాలరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

అమ్రాబాద్ పోలీస్ స్టేషన్లో..

అమ్రాబాద్: అగ్రిమాపక వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు అవగాహన కల్పించడానికి అగ్నిమాపక సిబ్బంది వారం రోజులపాటు కార్యక్రమ ప్రణాళికను ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం అమ్రాబాద్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక అగ్నిమాపక అధికారి అమరేందర్, సిబ్బంది పాల్గొని అగ్నిమాపక వారోత్సవాల సంబంధించిన కరపత్రం, వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

ఘనంగా ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలు

కల్వకుర్తి, ఏప్రిల్ 13 : కల్వకుర్తి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆనంద్‌కుమార్ కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌కు పలువురు పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్‌లు పసుల సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకుందాం

- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, ఏప్రిల్ 13 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా ముందుకు సాగుతూ అభ్యర్థి ఘన విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని వైఆర్ఆర్ కాంప్లెక్స్‌లో శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్‌భగీరథ మాజీ ఉపాధ్యక్షుడు, తలకొండపల్లి జడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్.శ్రీనివాస్ యాదవ్, మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జడ్పీటీసీ సభ్యులు విజితారెడ్డి, దశరథ్‌నాయక్, పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమైందని విమర్శించారు. హామీల అమలులో ఎన్నికల కోడ్ సాకు చెప్పి ప్రభుత్వం కాలం వెల్లదీస్తున్నదని విమర్శించారు. ఈ నెల 18న కల్వకుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరుగుతుందని సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్‌పీ హాజరు కానున్నారని ఆయన తెలిపారు. అనంతరం గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల వెంకటేష్, శ్రీనివాస్ యాదవ్, ఎడ్మ సత్యం మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేసి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సింగం విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, నాయకులు లాలయ్యగౌడ్, ఎముక జంగయ్య, ఎల్ఎస్.రెడ్డి, ఈశ్వరయ్య, సూర్యప్రకాశ్‌రావు, సైదులుగౌడ్, మహిపాల్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రావు, బాలయ్య, శేఖర్, పాండుగౌడ్, కిశోర్, గణేష్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్

ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు

- వట్టెం వెంకన్న ఆలయ వ్యవస్థాపక సభ్యుడు సందడి ప్రతాప్ రెడ్డి

బిజినేపల్లి, ఏప్రిల్ 13 : సంపూర్ణ ఆరోగ్యానికి మించిన ఆస్తి ప్రపంచంలో మరోకటి లేదని వట్టెం వెంకన్న ఆలయ వ్యవస్థాపక సభ్యుడు, సందడి కిష్టమ్మ, రాఘవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సభ్యుడు సందడి ప్రతాప్ రెడ్డి అన్నారు. మండలంలోని వట్టెం గ్రామంలో హైతరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ సందడి కిష్టమ్మ, రాఘవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌ల సంయక్త ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్య శిబిరాని నిర్వహించి వేలాది మందికి వైద్య పరీక్షలు, మందులను పంపిణీ చేశారు. యశోద హాస్పిటల్స్‌లో పనిచేసే గుండె సంబంధ, క్యాన్సర్, గర్భాశయ, స్త్రీ, పిల్లల, గ్యాస్ట్రిక్, ఎముకల సంబంధ నిపుణులతో రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా ఈసీజీ, టుడీ ఇకో, ఎముకల పరీక్ష, అబ్డామిన్, సుగర్, బీపీ వంటి తదితర పరీక్షలను చేశారు. అనంతరం మందులను అందజేశారు. యశోద హాస్పిటల్స్ జనరల్ మేనేజర్ చిదురె శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించే అవకాశాన్ని కల్పించిన సందడి కిష్టమ్మ రాఘవరెడ్డి ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు నరేం దర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, జక్‌పాల్ రెడ్డి, చంద్రారెడ్డి, యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్, వైద్యులు రేణుక, శశిధర్ రెడ్డి, వెంకటేష్, నరేష్, ప్రశాంత్, కేశవానంద్, జ్యోతి, రమాకాంత్ రెడ్డి, రేడియాలజీ శంకర్, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ అమృత్ రెడ్డి, వలంటీర్లు రాగి మధుసూదన్ రెడ్డి, భగవంత్ గౌడ్, నీలం రామకృష్ణ, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.



వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న సందడి ప్రతాప్ రెడ్డి

అక్రమాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఊర్కొండ ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రా రెడ్డి

ఊర్కొండ, ఏప్రిల్ 13: 'అభయుడి భూములకు రక్షణేది?' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో శనివారం రాగా, స్పందించిన అధికారులు బీజేపీ నాయకులతో కలిసి భూములను పరిశీలించారు. మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి దేవాలయం భూములు మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి ఇరువైపులా ఆక్రమణకు గురైన వాటిని కార్యనిర్వహణాధికారి సత్యచంద్రా రెడ్డి, ఆలయ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభయుడి భూములను ఆక్రమించుకున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ భూములను సర్వే చేయించి హద్దులు గుర్తిస్తామని, అదే విధంగా కంచె ఏర్పాటు చేస్తామని తెలిపారు. వారి వెంట నర్సంపల్లి మాజీ సర్పంచ్ నిరంజన్ గౌడ్, ఆలయ మాజీ చైర్మన్ నర్సిరెడ్డి, బీజేపీ నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, వెంకట్ నర్స్, అరవింద్ గౌడ్, నరేందర్ గౌడ్, మహేందర్, రాజనారాయణరెడ్డి, ఆంజనేయులు, సురేందర్, అంజయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.


భూములను పరిశీలిస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, అధికారులు, నాయకులు

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం


ఊర్కొండలోని వెంకట బలరామయ్య పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఊర్కొండ, ఏప్రిల్ 13: కల్వకుర్తి వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వెంకట బలరామయ్య పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ సామల బాలరాజు అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి వచ్చే నెల 25 వరకు శిక్షణ శిబిరం ఉంటుందని, ఈ శిబిరంలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు, పలు రంగాలలో మెలకువలు మెరుగుపరిచేందుకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. మండలంలోని ఆసక్తిగల విద్యార్థులు ఈ వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పాఠశాల చైర్మన్ సామల తిరుపతయ్య ఉపాధ్యాయులు రామ్ పెరుమాండ్ల, వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

లింగాల, ఏప్రిల్13:గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలని ఎస్సై జగన్‌మోహన్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వ్యాపారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేరాలను అదుపు చేయడానికి సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని అన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఆధునిక కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు ఆర్థిక వనరులు కూడా సమకూర్చుకోవల్సి ఉంటుందని అన్నారు.

ముగిసిన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


ఆవంచలో వాహనాల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

తిమ్మాజిపేట, ఏప్రిల్ 13 : మండల పరిధిలోని ఆవంచలో ఈనెల 10న ప్రారంభమైన శ్రీమహాలక్ష్మీ గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు ఆయిన యాగశాల నిత్యారాధన, శ్రీపుష్పయాగం, ధ్వజారోహణం, వాహనాల ప్రదర్శన చేశారు. ఎంతో అందంగా అలంకరణ చేసిన మోటారు వాహనాల ప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తరలి రావడం విశేషం. ఆ ప్రాంతమంతా గోవింద నామస్మరణతో మారుమోగింది. ప్రతిరోజు భక్తులకు అన్నదానం చేశారు. మహిళలు బతుకమ్మలు యువకులు, కోలాటాలు, భజనలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రధాని నరేంద్ర మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

ఊర్కొండ, ఏప్రిల్ 13: కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని మాజీ సర్పంచ్ నిరంజన్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ప్రతిరోజు రెండు గ్రామాల చొప్పున ఇంటింటికి తిరుగుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేసినటువంటి కృషిని ప్రజలకు వివరంగా తెలియజేసి మూడోసారి మోదీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, వెంకట్ నర్స్, రాజ్ నారాయణరెడ్డి, సురేందర్, మహేందర్, తదితరులు ఉన్నారు.

కేదారేశ్వర చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ విడుదల


బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఉప్పునుంతల, ఏప్రిల్ 13 : కేదారేశ్వర చెన్నకేశవస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు వాల్‌పోస్టర్‌ను శనివారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని కేదారేశ్వర ఆలయం ఆవరణలో విడుదల చేశారు. ఈ నెల 16 నుంచి 19 వరకు శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ తెలిపారు. ఈ నెల 16న మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఎదురుకోళ్లు, 17న బుధవారం ఉదయం 10.30 గంటలకు సీతారామచంద్రస్వామి వారి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు కోలాట పోటీలు, 18న గురువారం తెల్లవారుజామున 5 గంటలకు రథోత్సవం, ఉదయం 10 గంటలకు జూనియర్ విభాగం ఎద్దులచే అంతర్రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు, మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నదానం, 19న శుక్రవారం సీనియర్ విభాగం ఎద్దులచే అంతర్రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు, సాయంత్రం 4 గంటలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. జంగిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తమ్మల శ్రీనివాసరెడ్డి, వెంకటయ్య, బాల్‌లింగం, సత్యం తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం


తాండ్ర గేటు వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎన్‌హెచ్ కన్సల్టెన్స్ అధికారి గంగాధర్, టీమ్ సభ్యులు

కల్వకుర్తి, ఏప్రిల్ 13 : కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామ స్టేజీ వద్ద జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని ఎన్‌హెచ్ కన్సల్టెన్స్ అధికారి గంగాధర్, టీమ్ సభ్యులు తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సూచన మేరకు శనివారం తాండ్ర, కొండారెడ్డిపల్లి స్టేజీల వద్ద రోడ్డును పరిశీలించారు. తాండ్ర గేటు వద్ద బారికేడ్లు చేయడం అవసరం ఉంటుందన్నారు. దేవరకొండ మార్గంలో సైతం బారీకేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

బ్యాంకుల రుణాల పరిమితి పెంచాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 13 : బ్యాంకుల్లో రైతులకు ఇచ్చే పంట రుణాల పరిమితిని పెంచాలని కల్వకుర్తి నియోజకవర్గ రైతు సేవా సంఘం అధ్యక్షుడు పసుల గోవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే పరిమితిని 2వేలకు మాత్రమే పెంచుతూ మొక్కుబడిగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులు రైతుకు ఎంత పొలం ఉన్న రూ.లక్ష 60వేలకు మించి పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పంట రుణాల పరిమితిని 5 లక్షలకు పెంచి వడ్డీ లేకుండా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు ఉప్పునుంతలలో బీఆర్ఎస్ ఎన్నికల సమావేశం

ఉప్పునుంతల, ఏప్రిల్ 13: మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ మండల పార్లమెంట్ ఎన్నికల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో రోడ్ షో

తిమ్మాజిపేట, ఏప్రిల్ 13 : తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రోడ్ షోను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాధవులు అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 4గంటలకు నిర్వహించే రోడ్ షోలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిలు పాల్గొంటారన్నారు. గ్రామాల వారిగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.